

సమావేశంలో మంత్రి సతీశ్‌జార్కిహొళి

ఔను.. ప్రభుత్వమే కారణం..!

● భద్రతా చర్యలు చేపట్టి ఉండుంటే 11 మంది మృతి చెందేవారు కాదు: మంత్రి సతీశ్ జార్కిహొళి

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో 11మంది మృతి విషయంలో ప్రభుత్వవైఫల్యమే కారణమని, అయితే ఎవరూ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని మంత్రి సతీశ్‌జార్కిహొళి అభిప్రాయపడ్డారు. చిక్కమగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుని ఉంటే 11మంది మృతి చెందేవారు కాదన్నారు. ప్రభుత్వ వైఫల్యం ఉందని అంగీకరించారు. గతంలోనూ రాష్ట్రంలో పలు సంఘటనలు చోటు చేసుకున్నాయని, అయితే ఎవరూ రాజీనామా ఇవ్వలేదన్నారు. సమస్యకు పరిష్కారం ముఖ్యమని, కానీ రాజీనామా కాదన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో సంఘటనలు జరిగాయని, అప్పుడు ప్రధానమంత్రి రాజీనామా చేశారా..? అని ప్రశ్నించారు.

బయోమెట్రిక్..!



- డిజిటల్ మోసంతో రేషన్ బియ్యం దోపిడీ
- బయో, ఓటీపీ లేకుండానే లాగేస్తున్నారు
- నెలాఖరులో అర్ధరాత్రి వెబ్‌సైట్‌లో గోల్‌మాల్..
- రేషన్ తీసుకోనివారు, వృద్ధుల కోటానే టార్గెట్
- అధికారులు, డీలర్ల భాగస్వామ్యంతోనే అక్రమాలు



బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం దోపిడీకి అక్రమార్కులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. బియ్యం అక్రమ సరఫరా కట్టుదిట్టమైన నేపథ్యంలో అసలు బియ్యం పంపిణీ కాకముందే పక్కదారి పట్టిస్తున్నారు. నెలాఖరులో రేషన్ తీసుకోనివారు, వృద్ధులు తదితర మిగిలి పోయిన వారి బియ్యాన్ని బయోమెట్రిక్ మోసాలతో బొక్కేస్తున్నారు. సమాజంలో అట్టడుగు వర్గాలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉండే వారికి బీపీఎల్ కార్డులు మంజూరు చేస్తారు. ఇంటిల్లిపాదికీ అవసరమైన బియ్యం, చక్కెరతోపాటు నిత్యావసరాలు కార్డుల ద్వారా పంపిణీ చేస్తారు. బీపీఎల్‌తోపాటు అంత్యోదయ కార్డులకు బియ్యం పంపిణీ చేసే విధానం దశాబ్దాలుగా సాగుతోంది. గతంలో రేషన్‌కార్డు కల్గిన కుటుంబీకులు ఎవరైనా చౌకధాన్య డిపో వద్దకు వెళ్తే నిత్యావసరాలు అందిస్తారు. ఒక మనిషికి రాష్ట్రప్రభుత్వం నుంచి 5 కేజీల బియ్యం, కేంద్రప్రభుత్వం 5 కేజీల బియ్యం పంపిణీ చేస్తోంది. ఈ ప్రక్రియ దశాబ్దాలుగా సాగుతోంది. కేంద్రం అందించే 5 కేజీల బియ్యానికి అదనంగా రాష్ట్రప్రభుత్వం అన్నభాగ్య పథకం ద్వారా 5 కిలోల బియ్యం అందిస్తామని ప్రకటించారు. అయితే రెండేళ్లుగా తగినంత బియ్యం సమకూర్చుకోవడం సాధ్యం కానందున రాష్ట్రప్రభుత్వ కోటాకు అనుగుణంగా బియ్యానికి బదులు నగదు బదిలీ చేస్తూ వచ్చారు. ఇటీవలే బియ్యం పంపిణీ ప్రారంభించింది. రాష్ట్రప్రభుత్వం అన్నభాగ్యపథకం ద్వారా 5 కేజీలు, కేంద్రప్రభుత్వ పథకం ప్రధానమంత్రి గరీబ్‌కల్యాణ అన్న పథకం ద్వారా బీపీఎల్, అంత్యోదయ కార్డులు కల్గినవారికి బియ్యం సమకూరుస్తారు.

పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్ నుంచే..

పౌర, ఆహార సరఫరాలశాఖ వెబ్‌సైట్‌లో రేషన్ పంపిణీ సమాచారం లభిస్తుంది. నెలలో ఎంతమంది లబ్ధిదారులు సరుకులు పొందారనేది గుర్తించవచ్చు. బియ్యం పొందనటువంటి కార్డుల సమాచారాన్ని సేకరిస్తారు. ప్రతి నెలా చివరన కొన్ని కార్డులకు బియ్యం పంపిణీ చేసినట్టు నమోదు చేస్తారు. 10 సెకన్ల వ్యవధిలో రెండేసి కార్డులకు పంపిణీ చేసినట్లు నమోదు చేస్తారు. రాత్రివేళల్లో సరుకుల పంపిణీ చేసినట్టు వెలుగులోకివస్తుంది. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యేందుకు 2 నిమిషాలు అవసరం అవుతుంది. కానీ 15 సెకన్లలోపుగానే బయో అనుసంధానమై బియ్యం తీసుకున్నట్లు వెబ్‌సైట్‌లో సమాచారం లభిస్తోంది. నెల చివరన వెబ్‌సైట్‌ను హ్యాక్ చేస్తున్నారు. చౌకధాన్యడిపోలలోనే బీపీఎల్ కార్డులు దుర్వినియోగం అవుతున్నాయి. బియ్యం విక్రయాల ద్వారా వచ్చే సొమ్ములో అధికారులకు భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. కార్డులు కల్గినవారికి సమాచారం లేకుండానే బియ్యం దుర్వినియోగం అవుతున్నాయి. ఒకవేళ కార్డుదారులు ప్రశ్నిస్తే సాంకేతిక లోపమని బదులు ఇస్తున్నారు.

యథేచ్ఛగా అక్రమాలు..

గతంలో కార్డు కల్గిన కుటుంబీకులలో ఎవరు వెళ్లినా కార్డు నెంబరు, యజమాని నెంబరు, సరుకు తీసుకునేవారి పేరు నమోదు చేసుకుని నిత్యావసర సరుకులు అందించేవారు. ఈ విధానం దాదాపు రెండు దశాబ్దాలకుపైగానే దేశమంతటా సాగింది. రాష్ట్రంలో 1.17 కోట్ల బీపీఎల్ కార్డులు, 10.80 లక్షల అంత్యోదయ కార్డులు ఉన్నాయి. పౌర ఆహార సరఫరాలశాఖ ప్రతి నెల చౌకధాన్య డిపోలద్వారా లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఇటీవల బీపీఎల్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేశారు. దీంతో రేషన్‌కార్డులోని సభ్యులు ఎవరైనా చౌకధాన్య డిపోవద్ద బయోమెట్రిక్ నమోదు ఆధారంగా బియ్యం పొందవచ్చు. లేనిపక్షంలో ఆధార్ ఓటీపీ ద్వారా కూడా రేషన్ బియ్యం పొందేందుకు వెసలుబాటు ఉంది. చేతివేళ్లలో రేఖలు సమసిపోయిన సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులకు బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇచ్చారు. అటువంటివారికి ఐరిష్ స్కానర్ ద్వారా కళ్లను స్కాన్ చేసి బియ్యం పంపిణీ చేస్తారు. ఈ విధానాలు తీసుకొచ్చేందుకు ప్రధాన కారణం కొన్నేళ్లకాలంగా చౌకధాన్య డిపోల ద్వారా పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పడుతోందనే పలు సాంకేతిక విధానాలు అనుసంధానం చేశారు. అయినా అక్రమ మార్గంలో నిత్యావసర వస్తువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతూనే ఉన్నాయి.


ప్రధానమంత్రి గరీబ్‌కల్యాణ అన్న పథకంతోపాటు అన్నభాగ్య పథకంతో సహా చెరో 5 కిలోలు కలిపి మొత్తం 10 కేజీల బియ్యాన్ని బీపీఎల్ కార్డులు కల్గిన ప్రతి వ్యక్తికి ఉచితంగా బియ్యం ఇవ్వాల్సి ఉంది. అంత్యోదయ కార్డుకు 20 కేజీల బియ్యం, 15 కేజీల రాగులు కలిపి 35 కేజీల ఆహార పదార్థాలు లభిస్తాయి. నగటున ప్రతి చౌకధాన్య డిపో యజమానులు ఆహార పదార్థాలను ప్రతినెల 5వ తేదీన ప్రారంభించి 20వ తేదీకి ముగిస్తారు. ప్రతినెలా చివరన రెండు రోజులలో 10-15 సెకన్ల వ్యవధిలో ఆహారపదార్థాలను పంపిణీ చేసినట్లు పౌర ఆహార సరఫరాలశాఖ వెబ్‌సైట్ ద్వారా వెలుగులోకి వచ్చింది.

పది నెలల్లో 9,584 క్వింటాళ్ల ధాన్యం జప్తు

2024 ఏప్రిల్ ప్రారంభం నుంచి 2025 ఫిబ్రవరి ఆఖరు వరకు అక్రమంగా రేషన్ విక్రయం, గోడౌన్లపై 285 కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవధిలో 8427 క్వింటాళ్ల బియ్యం, 35 క్వింటాళ్ల రాగి, 341 క్వింటాళ్ల గోధుమలు, 505 క్వింటాళ్ల జొన్నలు, 53 క్వింటాళ్ల చక్కెరతో కలిపి 9,584 క్వింటాళ్ల ఆహార ధాన్యాలను జప్తు చేశారు.

తూకాల్లోనూ మోసాలు..

చౌకధాన్య డిపో యజమాని రేషన్ పంపిణీ చేసేవేళ తూకాలలో మోసాలు చేస్తుంటే బియ్యం మిల్లుల యజమానులు బ్లాక్‌మార్కెట్‌కు తరలించి వాటిని పాలిష్ చేసి ఇతర బ్రాండ్ల పేరితో ప్యాకింగ్ చేసి దేశ విదేశాలకు తరలిస్తున్నారు. బియ్యం గోడౌన్‌ల నుంచే అధికారులు కన్నం వేస్తున్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) గోడౌన్‌లనుంచి డిపోలకు లారీలలో తరలించేవేళ, లారీ యజమానులు, డ్రైవర్‌లు, హమాలీలు ప్రతి సంచినుంచి 3-4 కేజీల బియ్యాన్ని తోడించేసి ఎక్కువ ధరకు విక్రయించుకుంటున్నారు. కొందరు కార్డుదారులు స్థానికంగా అందుబాటులో లేకున్నా, మృతి చెందినవారి కార్డులకు ఏళ్ల తరబడి సరుకులు పంపిణీ అవుతున్నాయి. ఇక కొనుగోలు చేసేవారు కూడా సదరు బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా నిత్యావసరాల పంపిణీ విషయంలో ప్రతి దశలోనూ అవినీతి సాగుతోంది. రేషన్‌కార్డులు కల్గినవారు గట్టిగా నిలదీస్తే ఉచితంగా బియ్యం తీసుకెళ్తున్నారు, అందులోనూ తూకాలు సక్రమంగా ఉండాలా అంటూ నిర్లక్ష్యం చేస్తున్నారు. పౌర ఆహార సరఫరాలశాఖ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి బయోమెట్రిక్, ఓటీపీ లేకుండానే నిత్యావసరాలను పొందుతున్న దందా వెలుగులోకి వచ్చింది. ఇలా నెలవారీ వేలాది కార్డులకు అందాల్సిన బియ్యం బ్లాక్‌మార్కెట్‌కు తరలుతోంది.

ఐ స్టాండ్ ఫర్ దయానంద్..

- మాజీ కమిషనర్‌కు పెరుగుతున్న మద్దతు
- అన్యాయంగా సస్పెండ్ చేశారంటూ ఆగ్రహం
- ప్రభుత్వ చర్యలపై నెటిజన్ల మండిపాటు



బెంగళూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ హోదా నుంచి దయానంద్‌ను సస్పెండ్ చేయడం సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు భార్య టబురావు ఎక్స్ ద్వారా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దయానంద్ ప్రామాణిక, ఉత్తమ అధికారి అని అభిప్రాయపడ్డారు. ఇదే విషయమై ప్రతిపక్షనేత అశోక్ స్పందిస్తూ మంత్రుల కుటుంబీకులే నగర పోలీస్ కమిషనర్‌గా దయానంద్ సమర్థవంతమైన అధికారి అని, నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరు అని కొనియాడుతున్నారన్నారు.

'ఐ స్టాండ్ ఫర్ దయానంద్...'

'ఐ స్టాండ్ ఫర్ దయానంద్' అనే ట్యాగ్‌లైన్ సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. నిజాయితీ, క్రమశిక్షణ కల్గిన అధికారికి ప్రభుత్వం ఇచ్చిన బహుమతి సస్పెన్షన్ అంటూ పలువురు నెటిజన్లు మండిపడ్డారు. రెండేళ్లపాటు కమిషనర్‌గా వ్యవహరించిన దయానంద్ ఎక్కడా విమర్శలను ఎదుర్కోలేదు. నగర పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లలో అవినీతి తగ్గించారు. పారదర్శక పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చారని పలువురు అభిప్రాయపడ్డారు. నగర పోలీస్ మాజీ కమిషనర్ భాస్కర్‌రావు స్పందిస్తూ రాష్ట్ర పోలీస్ చరిత్రలో ఇదో బ్లాక్ డే అంటూ కామెంట్ చేశారు. ఓ నగర పోలీస్ కమిషనర్‌ను సస్పెండ్ చేసిన దాఖలాలు లేవని, పైగా క్రమశిక్షణ కల్గిన వారికి ఇటువంటి శిక్ష సమంజసమేనా అని ప్రశ్నించారు. కన్నడ పోరాట నేత రూపేశ్ రాజణ్ణ ఇది రాజకీయ తీర్మానమని, తప్పు ఎవరిదో... శిక్ష మరెవరికో అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాల్మీకి ప్రసన్నానందస్వామిజీ, దయానంద్ నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. సస్పెన్షన్ చేయడం బాధ కలిగించిందని దయానంద్‌తో అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కుమారస్వామి, సోమణ్ణలు క్రమశిక్షణ కల్గిన అధికారిపై ఇలాంటి వేటు సమంజసం కాదని మండిపడిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ వైఫల్యమే..!

- ఆర్సీబీ ఘటనపై బీజేపీ ఆగ్రహం
- ప్లకార్డులతో నిరసన
- బాధిత కుటుంబీకులకు నెలవేతనం పరిహారం


విధానసౌధ ప్రాంగణంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

బెంగళూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యంతోనే ఆర్సీబీ అభిమానులు బలయ్యారని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. విధానసౌధ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ నేతలు ఆదివారం ఆందోళన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే 11మంది మృత్యువాత చెందారని మండిపడ్డారు. అధికారులపై వేటు వేసి అసలు సూత్రధారులైన పాలకులు తప్పించుకునే కుట్ర పన్నుతున్నారన్నారు. సీఎం, డీసీఎంలు నిర్వాకంతోనే ఘోర ప్రమాదం జరిగిందన్నారు. సీఎం, డీసీఎం, హోం మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వెంటనే నైతిక బాధ్యత వహించి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి, ఎంపీ గోవింద కారజోళ, ఎమ్మెల్యేలు ధీరజ్ మునిరాజు, సీకే రామమూర్తి, అశ్వత్థ నారాయణ, బైరతి బసవరాజ్, అరుణ్ శంకరమూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తొక్కిసలాటలో మృతి చెందినవారి కుటుంబీకులకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నెల వేతనాన్ని పరిహారంగా ఇస్తున్నట్టు ప్రకటించారు.

కమిషనర్‌పై వేటు సరికాదు : కేంద్రమంత్రి సోమణ్ణ

మైసూరులో కేంద్రమంత్రి సోమణ్ణ మాట్లాడుతూ క్రమశిక్షణ కల్గిన పోలీస్ కమిషనర్ దయానంద్‌పై వేటు సరికాదని మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసులు నైతిక బాధ్యతతో పనిచేశారన్నారు. ఓ మంచి అధికారిపై సస్పెన్షన్ వేటు సరికాదన్నారు. మీ పటాలం నిర్వాకంతోనే ప్రమాదం జరిగిందని సీఎంను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కేవలం క్రెడిట్ పొందాలనే ఆత్రుతతోనే ప్రమాదం జరిగిందన్నారు. మీ అంతర్గత కుమ్ములాటలతో సామాన్యులను బలి చేశారన్నారు. ప్రధానమంత్రి కార్యాలయానికి సగం రోజు వచ్చి పరిశీలిస్తే ఎలా వ్యవహరిస్తారో తెలుస్తుందన్నారు. ఎవరికి వారుగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, సిద్దరామయ్య నుంచి ఇటువంటి పాలన ఊహించలేదన్నారు.

సూట్ కేసులో మహిళ మృతదేహం

● బీహార్‌లో ఏడుగురి అరెస్టు

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర శివారు ఆనేకల్ తాలూకా సూర్యనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సూట్‌కేసులో లభించిన మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. బిహార్‌కు చెందిన హర్షిత్‌కుమార్, ముఖేశ్ రాజబన్సి, ఇందుదేవి, రాజారాం కుమార్, పింటుకుమార్, కాలుకుమార్, రాజుకుమార్‌లను శనివారం అరెస్టు చేశారు. కాచనాయకనహళ్ళిలో నివసించే హర్షిత్‌కుమార్ మే 13న బెంగళూరు నుంచి బిహార్ వెళ్లాడు. 15వ తేదీన బాలికతోపాటు తిరిగి బెంగళూరుకు వచ్చాడు. బెంగళూరులో పలు ప్రాంతాలలో పర్యటించాడు. రాత్రివేళ సమీపబంధువు ముఖేశ్ ఇంటికి బాలికతోపాటు వెళ్లాడు. 19న బాలికతో లైంగిక చర్యకు ప్రయత్నించాడు. బాలిక గొడవ చేయడంతో రాడ్‌తో దాడి చేసి, ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. మృతదేహాన్ని సూట్‌కేసులో ఉంచి చందాపుర రైల్వే బ్రిడ్జ్ వద్ద పడేశాడు. మే 20వ తేదీన గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి విభిన్న కోణాలలో దర్యాప్తు చేశారు. బిహార్‌కు వెళ్లి ఏడుగురిని అరెస్టు చేశారు.

విత్తన పంపిణీ ఇంకెప్పుడు..?

● సాగు మొదలైనా ప్రక్రియ ప్రారంభించని ప్రభుత్వం ● నాణ్యతలేని విత్తనాలతో నష్టపోతున్న రైతులు

బళ్లారి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ముంగారు వానలు బాగా కురిశాయి. రుతుపవనాల కన్నా ముందే జోరువానలు కురియడంతో రైతులు పొలాలను దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేసుకున్నారు. అయితే ప్రభుత్వం అందించాల్సిన విత్తనాలు మాత్రం అందక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికీ విత్తన పంపిణీ ప్రారంభం కాలేదు. బళ్లారి, వియనగర, కొప్పళ, రాయచూరు జిల్లాలో వర్షాధారం కింద ఖరీఫ్‌లో సుమారు 9లక్షలా 8వేలా 221 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ పేర్కొంది. ఇందులో చాలా వరకూ వేరుశనగర, ముంగారి పత్తి, జొన్న, అంతర పంటలుగా అలసంద, కొర్ర, సజ్జ లాంటి పంటలు సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు. 2025-26 జూన్‌లో ఖరీఫ్ సీజన్ సాగు అయినా ఇంత వరకూ రైతులకు ప్రభుత్వం నుంచి విత్తన కాయలు అందించ లేదు. రైతులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు ఏజెన్సీలను ఆశ్రయిస్తున్నారు. క్వింటాల్ వేరుశనగ విత్తనం రూ. 12 వేల వరకు బయట మార్కెట్లో అమ్మకాలు సాగుతున్నాయి. ఇక జొన్న, సజ్జ, ఇతర పంటల సాగుకు అవసర అయిన విత్తనం కూడా ప్రభుత్వం సరిగ్గా అందించడం లేదు. ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తామని ప్రకటన చేసినా ఇంత వరకూ ప్రక్రియ ప్రారంభించలేదు. ప్రైవేటు వ్యాపారులు రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని విత్తన ధరలు భారీగా పెంచేస్తున్నారు. పైగా పలు కంపెనీలు నాణ్యత లేని విత్తనాలు మార్కెట్లోకి వదిలేశారు. దీంతో అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విత్తనాలు అందజేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

విజయనగర జిల్లా హువ్వినఅడగలిలో విత్తనం వేస్తున్న రైతులు


వందేళ్లు పైబడింది..!

- ఆ పాఠశాలకు 122 ఏళ్లు
- ప్రముఖులెందరో చదివారు
- మరమ్మతులు చేపట్టాలని స్థానికుల వినతి

బళ్ళారి గాంధీనగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బ్రిటీషు వారి కాలంలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల శిథిలమై పోతోంది.. పురాతన పాఠశాలకు పునర్జీవం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విజయనగర జిల్లా, హరపనహళ్ళి పట్టణంలో బాణగెరెలో ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది... సాహితీవేత్తలు, రాజకీయ ప్రముఖులు మారగా... మరెంతో మంది ఉన్నత శిఖరాలకు చేరుకున్న జ్ఞాపకాలకు గుర్తుగా ఉండాల్సిన ప్రభుత్వ పాఠశాల ప్రస్తుతం శిథమైన స్థితిలో కనిపిస్తుండడం విచారించదగ్గ విషయం. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం...ఇలాంటి చారిత్రక కట్టడాల స్థానంలో కొత్తగా పాఠశాలలు నిర్మించి నేటి తరాలకు ఆదర్శ పాఠశాలగా దిద్దడంతో నేటి పాలకులు... అధికారులు నిర్లక్ష్య ధోరణి చూపిస్తుండడం విచారించదగ్గ విషయం. ప్రముఖ సాహితీ రాయసం భీమసేన్ రావ్ ఇదే పాఠశాలలో ఓనమాలు... దిద్దిన చరిత్ర ఈ పాఠశాలకు ఉండడం గమనార్హం. 1903లో బ్రిటీషు వారి పాలనలో కాలంలో నిర్మించిన ఈ పాఠశాలకు 122 ఏళ్ళ చరిత్ర ఉండడం విశేషం. అయినా ఇదే పాఠశాలలో నేటికీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఈ పాఠశాలలో 1 నుండి 8వ తరగతి వరకు ఇదే 152మంది విద్యార్థులు ఉండగా, ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. 17 తరగతి గదులు ఉన్న ఈ పాఠశాలలో కేవలం 4 తరగతి గదులు మాత్రమే విద్యార్థులు కూర్చోవడానికి అనకూలంగా ఉండగా, మిగిలిన 13 తరగతి గదులు, ప్రహరీ నేలకూలాయి. పాఠశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల తల్లితండులు కూడా ఈ పాఠశాలలో పిల్లలను చేర్చడానికి వెనకాడుతున్నారు. దీంతో ఏటా పాఠశాలలో విద్యార్థుల చేరిక తగ్గుతున్నట్లు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే 29న తేదీన పాఠశాల ప్రారంభం కాగా ఇప్పటి వరకు కేవలం ఆరు మంది విద్యార్థులు చేరినట్లు తెలుస్తోంది. పాఠశాలకు అవసరమైన గదులు కొత్తగా నిర్మించి పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని పాఠశాల ఉపాధ్యాయులు స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


శిథిలావస్థలో బ్రిటీషు కాలం నాటి ప్రభుత్వ పాఠశాల



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1599.66	1,577.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7.905	517
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	246	5
నీటి నిల్వ (టీఎంసీలు)	21.09	3.50

రోడ్డు పనులకు భూమిపూజ



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సిరుగుప్ప, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వన్నూరు గ్రామంలో వాల్మీకి కాలనీలో పంచాయితీరాజ్ శాఖ రూ.కోటి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టింది. పనులకు ఆదివారం ఎమ్మెల్యే బి.ఎం నాగరాజ భూమి పూజ చేశారు. వాల్మీకి కాలనీ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తాలూకా అధ్యక్షుడు కరిబసప్ప, పంచాయతీ అధ్యక్షుడు బసవరాజు, నగరసభ కౌన్సిలర్ గణేష్, మజీద్ రామా, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

రాళ్ల మధ్య ఇరుక్కున్న పర్యాటకుడు

● కాపాడిన పోలీసులు



పర్యాటకుడిని కాపాడిన పోలీసులు

బళ్లారి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హంపి వీక్షణకు వచ్చిన మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన పర్వా అసత్ అనే పర్యాటకుడు ఆదివారం మాతంగి పర్వతం వద్దనున్న కొండలో రాళ్ల మధ్య ఇరుక్కుపోయాడు. అతన్ని హంపి టూరిజం పోలీసులు కాపాడారు. ఆదివారం మతంగి పర్వతం వద్ద ఉన్న కొండ ఎక్కి చూస్తుండగా రాళ్ల సందులో పడిపోయాడు. దీన్ని గమనించిన ఇతర పర్యాటకులు వెంటనే అక్కడున్న టూరిజం కార్యాలయానికి సమాచారం అందించారు. వెంటనే రెస్క్యూ టీం వచ్చి రాళ్లమధ్యలో ఇరుకున్న ఆ యువకుడిని కాపాడారు.

దివ్యాంగురాలికి పింఛన్ పంపిణీ



పింఛన్ అందజేస్తున్న సంస్థ సభ్యులు

సిరుగుప్ప, జూన్8(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగురాలికి పింఛన్ అందజేశారు. ఆదివారం నగదును కౌన్సిలర్ ఖాజామొదీన్ ఆ దివ్యాంగురాలికి పంపిణీ చేశారు. సిరుగుప్ప తాలూకాలోని తెక్కలకోట గ్రామానికి చెందిన రాజాసాబ్ అనే దివ్యాంగుడికి ప్రతి నెలా రూ.1000 పింఛన్ను అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ప్రభావతి తెలిపారు.

బళ్లారిలో ఇసుక రవాణా బంద్

● పనులు లేక అల్లాడుతున్న కట్టడ కార్మికులు
● ఆగిపోయిన నిర్మాణాలు

బళ్లారి సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో పక్షం రోజులుగా ఇసుక రవాణా నిలిచిపోయింది. నిర్మాణ పనులు దాదాపు నిలిచిపోయాయి. ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రోజువారీ కూలీల జీవితాలు దుర్భరంగా మారాయి. బళ్లారి తాలూకాలోని వనేనూరు, ఆసుండి, యాల్పి, కర్చేడులలో మొత్తం ఐదు ఇసుక డంప్‌లు ఉన్నాయి. ఈ డంప్‌లు బళ్లారి అంతటా ఇసుకను సరఫరా చేస్తాయి. ప్రస్తుతం ఉన్న బ్లాకులలో ఒకటైన ఆసుండిలో రామకృష్ణరావుపై ఇసుక అక్రమ తవ్వకాల ఆరోపణలు వచ్చాయి. అదనంగా ఇతర బ్లాక్‌లలో ఇసుక తవ్వకాలపై దర్యాప్తు చేయాలని భూగర్భశాఖ నిర్ణయించింది. జిల్లాలో 13 కొత్త ఇసుక బ్లాక్‌లను వేలం వేయాలని గనులు భూగర్భ శాఖ ప్రతిపాదించింది. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిగేందుకు అనుమతించమని గనులు, భూగర్భశాఖ అధికారులు తేల్చిచెప్పారు. పక్షం రోజులుగా ఇసుక సరఫరా నిలిచిపోవడంతో ఓ వైపు నిర్మాణ పనులు నిలిచిపోయాయి.



భవన నిర్మాణ పనుల్లో కార్మికుడు (ఫైల్)

మరోవైపు ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ కూడా పడిపోయింది. ఇసుకను అక్రమంగా రాత్రిపూట వెలికితీసి విక్రయించే వ్యాపారం జోరందుకుంది.

భారీ వర్షానికి తెగిన వంతెనలు..!

● రెండు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు..!

రాయచూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాయచూరు తాలూకా వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ ధ్వంసమైయ్యాయి. పత్తేపూర్, జాగీర్ వెంకటాపూర్ రెండు గ్రామాలకు ఉన్న వాగు పై ఉన్న వంతెనలు కొట్టుకుపోగా ఈ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రోడ్ల గుండానే జిల్లా కేంద్రం రాయచూరుకు రాకపోకలు సాగిస్తున్న నేపధ్యంలో ఒక్కసారిగా కురిసిన వర్షానికి పాతపడిన వంతెనలు కూలిపోయాయి. పతేపూర్ గ్రామ వాగు పై కొత్తగా నిర్మిస్తున్న వంతెన పనులు రెండేళ్లుగా నత్తనడక సాగుతుండడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో గ్రామస్థులు సుల్తాన్‌పూర్ మీదుగా 10కి.మీ తిరిగి రాయచూరుకు చేరుకునే పరిస్థితి తలెత్తింది. అదే విధంగా జాగీర్ వెంకటాపూర్ వాగు పై నిర్మిస్తున్న వంతెన సహితం పూర్తికాకపోవడంతో పాత వంతెన పై పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వాగు పై వస్తున్న టిప్పర్ ఒకటి వరద ప్రభావం ఎక్కువ కావడంతో డ్రైవర్ మధ్యలోని నిలిపివేసి వంతెన పై నే బండిని నిలిపి వెళ్లాడు. కాగా శనివారం రాత్రి భారీ వర్షంతో పాటు పిడుగు పడడంతో జిల్లాలోని దేవదుర్గ తాలూకా క్యాదిగేరా



తెగిన వంతెన వద్ద గ్రామస్థులు

సమీపంలోని తాండాలో రైతుకు చెందిన పశువు మృత్యువాత పడింది. సంఘటన స్థళాన్ని రెవెన్యూ శాఖ అధికారులు, పీడీఓలు పరిశీలిచారు.

ఉపాధి కూలీల నిరసన



కార్యాలయం వద్ద ముళ్ల కంపలను ఉంచిన కూలీలు

రాయచూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): చేసిన పనికి కూలి చెల్లించకుండా తిరిగి అదే పని చేయాలంటు పిలిచిన గ్రామ పంచాయతీ అధికారుల తీరు పై కూలీ కార్మికులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని మాన్వి తాలూకా సంకేశ్వర గ్రామ శివారులో నాలా పూడిక తీయుత పనులు మే నెలలో పూర్తి చేయగా అందుకు సంబంధించిన కూలి డబ్బులు ఇప్పటి వరకు చెల్లిచని అధికారులు, తిరిగి అదే పని చేయాలంటు శనివారం కూలీలను ఆహ్వానించారు. దీంతో అప్పటికే పని పూర్తి చేసిన కూలీలు అక్కడికి వెళ్లగా పంచాయతీ అధికారి గాని, లేకా ఉపాధిహామికి సంబంధించిన ఏ ఒక్క అధికారి అక్కడికి రాకపోగా దాదాపు 4 గంటల పాటు వేచి చూసిన కార్మికులు అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేస్తు సుంకేశ్వర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సమీపంలో ఉన్న ముళ్ల పొదలను తెచ్చి కార్యాలయం ముందుంచి తమ నిరసనను తెలిపారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

● ఇదరి మృతి.. మరొకరికి గాయాలు

నంబులపూలకుంట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కంవారిపల్లి సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలలు మృతి చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తనకల్లు మండలంలోని మారెప్పగారిపల్లికి చెందిన షేక్‌మహమ్మద్ సుహేల్, మహమ్మద్ లతీఫ్, తోసీఫ్.. తిమ్మమ్మ మర్రిమానును సందర్శించడానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. తిమ్మమ్మ మర్రిమాను నుంచి కొక్కంటి క్రాస్‌కు వెళ్తున్న కారు ముక్కంవారిపల్లి వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో షేక్ మహమ్మద్ సుహేల్ (16) అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన మహమ్మద్ లతీఫ్(17)ను కదిరికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. తోసీఫ్‌ను 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుహేల్ పదో తరగతి, లతీఫ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చేరాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తగ్గిన పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన వారంతపు పశువుల సంత ఆదాయం ఈవారం తగ్గింది. బక్రీద్ పండుగ నేపథ్యంలో గత రెండు వారాలు రూ.5లక్షలకు పైగా మార్కెట్‌కు ఆదాయం వచ్చింది. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.1,89,610, ఆదివారం జరిగిన ఎద్దులు, ఎనుముల సంతతో రూ.60,100 మార్కెట్‌కు ఆదాయం వచ్చింది. రెండురోజుల సంతతో రూ.2,49,710 మార్కెట్‌కు వచ్చినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.



నిరసనలో గ్రామస్థుడు

రోడ్డు బాగు చేయాలని నీటిలో కూర్చుని నిరసన

బళ్లారి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు బాగు చేయాలని నీటిలో కూర్చొని ఓ వ్యక్తి నిరసన తెలిపాడు. ఎన్నోళ్లుగా నరసింగపుర-భుజంగానగర్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్నాయని ఆవ్యక్తి ఆందోళన చేపట్టాడు. నీటిలో కూర్చుని రోడ్డు బాగుచేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశాడు. సండూరు అంటేనే ఇనుప ఖనిజం కలిగిన ప్రాంతం. ఇక్కడ ముడిఖనిజంతో గనుల లీజ్‌దారులు, ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం. అలాంటి ఆదాయం అందిస్తున్న గ్రామంలో రోడ్ల పరిస్థితి చూస్తే ఎవరికైనా బాధ కలుగుతుంది. నరసింగపుర-భుజంగానగర్ గ్రామాలకు వెళ్లే దారి అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతం నుంచి నిత్యం మైనింగ్ లోడ్‌తో భారీ వాహనాలు వెళుతుంటాయి. ఈ దారి మధ్యలో కల్వర్ట్ పూర్తిగా దెబ్బతినింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

పోలీసు జాగిలంతో నిందితుడి గుర్తింపు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ పుట్టమాదయ్య

రాయచూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పోలీసు జాగిలం సహాయంతో హత్యకు పాల్పడిన నిందితుడిని గుర్తించడంలో లింగసుగూరు పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారు. ఆదివారం ఉదయం లింగసుగూరు తాలూకా యరగుంటి గ్రామ సమీపంలో యువకుడి మృతదేహం రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబస్థులకు సమాచారం ఇచ్చారు. వెంటనే గ్రాస్థులతో కలిసి అక్కడి చేరుకున్న కుటుంబస్థులు పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడకు చేరుకున్న లింగసుగూరు పోలీసులకు మృతదేహం తప్పా ఎలాంటి ఆధారాలు లభించలేదు. వెంటనే పోలీస్ జాగిలాన్ని, వేలిముంద్ర నిపుణులను అక్కడికి రప్పించిన పోలీసులు హత్య జరిగిన కీ.మీ దూరంలో రక్తం మరకలంటిన కొడవలి పడి ఉండడాన్ని గుర్తించారు. ఈ రెండింటి ఆధారంగా పోలీస్ జాగిలం నేరుగా నేరస్థుడి ఇంటి వద్దకు వెళ్లడంతో వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. కాగా మృత్యువాతపడిన బసనగౌడకు శుక్రవారం సాయంత్రం ఫోన్ రావడంతో ఇంట్లో నుంచి బయటికి వెల్లాడు. శనివారం రాత్రి వరకు ఆయన తిరిగి రాకపోవడంతో అనుమానించిన కుటుంబస్థులు మరసటు రోజు ఉదయం గ్రామ సమీపంలోని ఒక పొలంలో శవమై పడి ఉండడం గమనించి గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం లింగసుగూరు పోలీసులతో కలిసి జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య సంఘటన స్థళాన్ని పరిశీలించారు.



మట్టి దిబ్బను తాకి దెబ్బతిన్న బైక్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

రాయచూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రాయచూరు-మంత్రాలయం ప్రధాన రహదారిలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. యరగేరా వైపు నుంచి బైక్ పై వస్తున్న ఇద్దరిని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జుకాగా బైక్ పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో బైక్ పై వెళుతున్న ఉరుకుంద(42), నరసింహులు(45)ల్లో ఒకరు అక్కడికక్కడే మృత్యువాత పడగా మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన యరగేరా పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ప్రమాదంలో యువకుడు..

జిల్లాలోని మస్కి తాలూకా ఈజే బసాపూర్ క్యాంప్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ పై ముగ్గురు యువకులు వెళుతుండగా రోడ్డు పక్కన వేసి ఉన్న మట్టి దిబ్బను తాకడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బైక్ బోల్తాగొట్టడంతో గిరీశ్(26) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులైన రాజా, అక్బర్ తీవ్ర గాయాలపాలైయ్యారు. రాజును రాయచూరు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించిన పోలీసులు అక్బర్‌ను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన తుర్విహాళ్ పోలీసులు కేసు నమోదు చేశారు.



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

హోసూరు జోన్

పన్నుల భారం తగదు..

● ప్రజలను తిప్పలు పెడుతున్న ప్రభుత్వం
● డీఎంకే సర్కార్‌పై మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ధ్వజం



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజలపై అప్పులు, పన్నుల భారం మోపిందని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ఆరోపించారు. జిల్లా అన్నాడీఎంకే కార్యాలయం వద్ద ఆదివారం హోసూరులో వివిధ పార్టీలకు చెందిన యువత పార్టీలో చేరారు. వారిని పార్టీ కండువాతో ఆత్మీయంగా స్వాగతించారు. శూలగిరి పశ్చిమ యూనియన్ కార్యదర్శి బాబు, హోసూరు ఉత్తర యూనియన్ కార్యదర్శి రవికుమార్, ఉపకేంద్ర కార్యదర్శులు రమేశ్, నవీన్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వానికి, గత సంవత్సరాల్లో అమ్మ, ఎడప్పాడి పళనిస్వామి పాలనకు మధ్య ఉన్న తేడాలు మాకు తెలుసు అన్నారు. ఇటీవలి నాలుగేళ్లలో డీఎంకే ప్రభుతత్వం ప్రజలపై అప్పులు, పన్నుల భారాన్ని మోపిందన్నారు. 2026 ఎన్నికల్లో డీఎంకేను ఇంటికి పంపుతామన్నారు. కార్యక్రమంలో రాజు, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి చేయాలి

● జిల్లా రైతుసంఘం సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షుడు షణ్ముగం

హోసూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలని అందుకు తగిన చొరవ చూపాలని రైతుసంఘం తీర్మానించింది. కృష్ణగిరి జిల్లా ఉత్తంగరైలో ఆవిన్ పాల ఉత్పత్తిదారులసంఘం జిల్లా అధ్యక్షుడు కే షణ్ముగం అధ్యక్షతన తమిళనాడు రైతుసంఘం సభ్యులు సమావేశమయ్యారు. జిల్లా యువజన విభాగం ఉపకార్యదర్శి, జిల్లా ఉపకార్యదర్శులు మాసిలామణి, రాధాకృష్ణన్, శివ, మునిరత్నం, సెల్వరాజ్, రామారావు, విష్ణు, తూర్పు జిల్లా అధ్యక్షుడు దేవేంద్రన్ పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఎం రామగౌండర్ సమావేశానికి హాజరై ప్రత్యేక ప్రసంగం చేశారు. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉత్తంగరై బ్లాక్‌లోని 33 చెరువుల అనుసంధాన ప్రాజెక్టులో, ఇమాం సాహెబ్ చెరువును రెడ్డిపట్టి చెరువుకు ఇండికుట్టై ద్వారా కురుక్కుర్ ద్వారా అనుసంధానం చేయాలి. రెడ్డిపట్టి చెరువు ద్వారా అరూర్ జాతీయ రహదారికి తారురోడ్డు నిర్మించాలి, పావక్కల్ పెరుమాళ్ గౌంతన చెరువు, నల్లువంపట్టి చెరువును పాంబర్ కాలువకు అనుసంధానం చేయాలి. అంగుతి సునై చెరువు, కాలువను పుత్తూరు చెరువుకు పూడిక తీడయం ద్వారా అనుసంధానం చేయాలి. ఉత్తంగరై అభివృద్ధి కోసం రెవెన్యూ డివిజన్ సృష్టించాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీ పథకాలు అమలులో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. జూలై 5న కృష్ణగిరిలో జరిగే రైతు దినోత్సవ ర్యాలీ, జయనారాయణస్వామి వందో పుట్టిన రోజు ర్యాలీ ఉంటుందని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

● 3న అదృశ్యం.. 4న ఫిర్యాదు
● పట్టించుకోని పోలీసులు ● 7న మృతదేహం లభ్యం

అనంతపురం క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీకి చెందిన లక్ష్మీపతి కుమార్తె తన్మయి(19)నగరంలో వివేకానంద కళాశాలలో ఇంటర్ సెకెండియర్ చదివింది. సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 3వతేదీ రాత్రి కడుపునొప్పిగా ఉందని కూల్‌డ్రింక్స్ తెచ్చుకుంటానని చెప్పి బయటకెళ్లింది. ఎంతసేపైనా ఇంటికి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికిన తల్లిదండ్రులకు కనిపించకపోవడంతో 4వతేదీ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 7న కూడేరు మండలం గొట్కూరు సమీపంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని శవం ఉందని పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కూడేరు సీఐ రాజు సిబ్బందితో కలిసి పరిశీలించారు. పోలీసులు గుర్తు తెలియని యువతి మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. తలపై తీవ్రగాయాలైనట్లు నిర్ధారించారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..

పోలీసులు మృతదేహాన్ని తల్లిదండ్రులు గుర్తించడంతో ఆదివారం మార్చురీ గదిలో పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడ తల్లిదండ్రులు మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు. అదృశ్యమైన మరుసటి రోజే ఫిర్యాదు చేశామని, పోలీసులు కాల్ లిస్ట్ తీస్తామని చెప్పి కాలయాపన చేశారని వాపోయారు. ముందుగానే గుర్తించి ఉంటే తమ కుమార్తె బతికి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తెను అలా చేసిన వాడిని శిక్షించాలని వేడుకున్నారు.

పోలీసుల అదుపులో యువకుడు

విద్యార్థి హత్యకేసును విచారణ చేపడుతున్న వన్‌టౌన్ పోలీసులు ఐదోరోడ్డుకు చెందిన నరేష్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. తనకు ఫోన్ చేసేది వాస్తవమేనని, తానే నేరం చేయలేదని నరేష్ చెప్పుకొచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో మరో అనుమానితుడు దినేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సీసీ ఫుటేజీలు, కాల్ రికార్డ్స్ ఆరా తీస్తున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంఫ్...

డూండీ (జయంతి)



డూండీగా పేరొందిన డూండేశ్వర రావు పోతిన 1932 జూన్ 9 బెజవాడలో జన్మించారు. తెలుగు సినీరంగంలో ప్రముఖ నిర్మాతగా పేరొందారు. ఆంధ్ర ప్రదేశ్‌లో తొలి సినిమా థియేటర్ రూపొందించిన పోతిన శ్రీనివాసరావు కుమారుడు. తెలుగు, కన్నడ, హిందీలలో 29 సినిమాలు నిర్మించారు. సూపర్ స్టార్ కృష్ణ నటించిన 'గూఢచారి 116' సినిమాతో గుర్తింపు పొందారు. 2005లో నంది అవార్డుల కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 2007 జనవరి 1న కన్నుమూశారు.

ఛార్లెస్ డికెన్స్ (వర్ధంతి)



ఛార్లెస్ జాన్ హుఫమ్ డికెన్స్ 1812 ఫిబ్రవరి 7న జన్మించారు. విక్టోరియా రాజులకాలంలో ఆంగ్లంలో గొప్ప నవలా రచయిత. సామాజిక అంశాలపై రచనలు చేసేవారు. ది పిక్‌విక్ పేపర్స్‌లో 1836లో ఆయన రచనలు సీరియల్‌గా ప్రచురితమయ్యాయి. సున్నితమైన హాస్యం, విమర్శ, సమాజాన్ని ఆలోచింపేవిధంగా రచనలు ఉండడంతో అతితక్కువ ఏళ్లలోనే ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. 1859లో 'ఏ టేల్ ఆఫ్ టు సిటీస్' (లండన్ అండ్ ప్యారిస్) నవల ఎంతో పేరొందింది. 1870 జూన్ 9న కన్నుమూశారు.

ఎన్‌జీ రంగా (వర్ధంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత ఆచార్య ఎన్‌జీ రంగాగా పేరొందిన గోగినేని రంగనాయకులు 1900 నవంబరు 7న గుంటూరులో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, పార్లమెంటు సభ్యుడు, రైతు నాయకుడు. రైతాంగ విధానాలకు మద్దతు ఇచ్చిన ఈయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు. రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. తర్వాత కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. స్వతంత్ర్య పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా దశాబ్దంపాటు కొనసాగారు. కాగా సుదీర్ఘకాలం పార్లమెంటు సభ్యుడిగా వ్యవహరించారు. 1995 జూన్ 9న తుదిశ్వాస వీడారు. రంగా పేరుతో జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించబడింది.

కిరణ్‌బేడి (పుట్టినరోజు)



తొలి మహిళా ఐపీఎస్ అధికారిణిగా గుర్తింపు పొందిన కిరణ్ బేడి 1949 జూన్ 9న అమృత్‌సర్‌లో జన్మించారు. 1972 నుంచి 35ఏళ్లపాటు వివిధ హోదాలలో కొనసాగారు. 2007లో డైరెక్టర్ జనరల్ (బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్)గా స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. 2016-2021 వరకు పుదుచ్చేరికి 24వ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కొనసాగారు. కాగా 1993లో ఢిల్లీ ప్రిజన్స్‌కు ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వ్యవహరించారు. దేశంలో పేరొందిన తిహార్ జైలులో పలు సంస్కరణలు తెచ్చారు. 1994లో రామన్ మెగసెసె అవార్డు పొందారు. 2003లో యునైటెడ్ నేషన్స్ పోలీస్‌కు హెడ్‌గా వ్యవహరించిన తొలి భారతీయ మహిళ. ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్, మదర్ తెరెసా మెమోరియల్ నేషనల్ అవార్డు తదితర గౌరవాలు పొందారు.

పాల్ బెట్టి (పుట్టినరోజు)



'ది మ్యాన్ బుకర్ ప్రైజ్' గ్రహీత పాల్‌బెట్టి 1962 జూన్ 9న జన్మించారు. అమెరికాకు చెందిన ఆయన 2015లో నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డు, 'ది సెల్ అవుట్' నవలకు 2017లో ఇంటర్నేషనల్ డబ్లిన్ లిటరరీ అవార్డు. 1990లో గ్రాండ్ పోయెట్రీ స్లామ్ ఛాంపియన్‌గా నిలిచారు. ఆయన రచించిన నవలలకు పాఠకులనుంచి ఉత్తమస్పందన వ్యక్తమైంది. కొలంబియా యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.

అనుష్క శంకర్ (పుట్టినరోజు)



అనుష్క శంకర్ 1981 జూన్ 9న లండన్‌లో జన్మించారు. సితార్ కళాకారులు పండిట్ రవిశంకర్ కుమార్తె. ఈమె కూడా సితార్ విద్వాంసురాలు. 13వ యేటనే తొలి ప్రదర్శన ఇచ్చారు. దేశ విదేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి పేరొందారు. సింగర్ నోరా జోన్స్‌తో కలసి గ్రామీ అవార్డు అందుకుని పాపులర్ అయ్యారు. పాన్ ఏషియన్ గర్ల్‌బ్యాండ్ ఏర్పాటుకు నడుం బిగించారు. చైనా, జపాన్, కొరియా, ఫిలిప్పీన్స్ తోపాటు ఇండియానుంచి ఒక్కొక్క పాప్ ఆర్టిస్ట్‌ను ఎంపిక చేయనున్నారు. ఐక్యరాజ్య సమితిలో వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్‌కు దేశం నుంచి ప్రతినిధిగా ఉన్నారు.

సోనం కపూర్ (పుట్టినరోజు)



స్టైల్ ఐకాన్‌గా పేరొందిన సోనం కపూర్ అహూజా 1985 జూన్ 9న జన్మించారు. హిందీలో ప్రముఖ నటుడు అనిల్ కపూర్ కుమార్తె. సినీరంగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రవేశించి నటిగా పేరొందారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటీమణులలో ఒకరు. నేషనల్ ఫిల్మ్ అవార్డు, 4 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ అంతర్జాతీయ ఉత్పత్తులకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బత్తలపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లి బీసీ కాలనీకి చెందిన శ్రీరాములు(41) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బత్తలపల్లి బీసీ కాలనీకి చెందిన శ్రీరాములు సుమారు రూ.12 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక అప్పులు ఇచ్చిన వారికి ఐపీ నోటీసులు పంపాడు. అప్పులు తీర్చలేనంటూ భార్యతో మదనపడేవాడు. శనివారం రాత్రి అందరూ మిద్దెపై పడుకొని ఉండగా కిందికి దిగివచ్చి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగు లాభదాయకం

» కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

బెంగళూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ ప్రాంతాలలో హార్టికల్చర్ పెరిగిందని, ఇటీవలి కాలంలో డ్రాగన్ ఫ్రూట్ పట్ల క్రేజ్ పెరిగిందని మూడో సంవత్సరం నుంచి రూ.6-7లక్షలు ఆదాయం పొందవచ్చునని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ అభిప్రాయపడ్డారు. హెసరఘట్టలోని భారతీయ హార్టికల్చర్ పరిశోధనా కేంద్రాన్ని (ఐసీఏఆర్) ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో వికసిత కృషి సంకల్ప అభియానలో పాల్గొని మాట్లాడారు. పరిశోధనల ఫలితాలు రైతులకు వెంటనే లాభదాయకం అయ్యేలా చూడాలన్నారు. రైతులు కూడా ఇప్పుడు శాస్త్రవేత్తలకు దీటుగా కొత్త పద్ధతులు అనుసరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. జీడీపీలో వ్యవసాయపాత్ర కీలకమన్నారు. ఉత్పత్తి రికార్డు స్థాయిలో ఉందన్నారు. కాగా నకిలీ విత్తనాలు, క్రిమిసంహారక మందులు తయారు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సంప్రదాయ సాగుకు ఆధునిక సొబగులు అవసరమన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కే సుధాకర్, ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్, హార్టికల్చర్ సంస్థ జనరల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే సింగ్, పశువైద్య సంస్థ జనరల్ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రభట్,



ఐసీఏఆర్‌లో ఏర్పాటైన ప్రదర్శనలో పనసపండ్లను వీక్షిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తదితరులు

హార్టికల్చర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ వీ సుబ్రమణ్యం, పలువురు శాస్త్రవేత్తలు, విద్యార్థులు, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

ముళబాగిలు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నరసింహతీర్థకు అనుబంధమైన శ్రీపాద రాజమఠంలో యోగనరసింహుడి రథోత్సవం, పాదరాజ ఆరాధన మహోత్సవాలు ఈనెల 9నుంచి 11వరకు విశేషపూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. 9న త్రయోదశిన శ్రీపాదరాజ పూర్వారాధన, 10న చతుర్దశిన మధ్యారాధన, యోగ నరసింహ, హనుమంతుడి, పాదరాజ రథోత్సవం, 11న పూర్ణిమ రోజున ఉత్తరారాధన సంప్రదాయంగా మఠాధిపతి సుజయనిధి స్వామిజీ నేతృత్వంలో జరగనున్నాయి. మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామిజీ, సోసలె వ్యాసరాజ మఠం విద్యాశ్రీశ తీర్థ స్వామిజీ విచ్చేయనున్నారు.

నరసింహతీర్థ పుష్కరిణి



నరసింహతీర్థ పుష్కరిణి



పాదరాజుల బృందావనం

శ్రీపాదరాజుకు ప్రత్యక్షతీర్థక్షేత్రంగా పేరొందిన నరసింహతీర్థ పుష్కరిణిలోని నీటికి గంగనీటికి ఉన్నంత గుణాలు ఉన్నాయనే పేరుంది. ఇక్కడ ఏడాది పొడవునా నీరు ఉంటుంది. ఈ పుష్కరిణిలో స్నానమాచరించి దేవుడి దర్శనం చేసుకోవడం ద్వారా మంచి జరుగుతుందనే విశ్వాసం ఉంది. తద్వారా రాష్ట్రం నుంచే కాకుండా పొరుగురాష్ట్రాల భక్తులు కూడా వస్తుంటారు. ఆరాధన మహోత్సవంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం, మంత్రాయల దాససాహిత్య ప్రాజెక్టు, జాతీయ వేద విజ్ఞానసంస్థ సహకారంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

మాజీ ఎమ్మెల్యే ఆరోపణల్లో వాస్తవం లేదు

» బమూల్ డైరెక్టర్ ఆనందకుమార్

దొడ్డబళ్లాపుర, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే టీ వెంకటరమణయ్య పదవి చేపట్టక ముందునుంచి కాంగ్రెస్‌లో తాను క్రియాశీలకంగా కార్యకర్తగా ఉన్నానని, బమూల్ డైరెక్టర్‌గా తాను అనుభవించిన అధికారం, హోదాలు రాజకీయ ఎదుగుదల వంటి అన్నీ శ్రమతో సాధించినవేనని మీ భిక్ష కాదని బమూల్ డైరెక్టర్ బీసీ ఆనందకుమార్ ఘాటుగా బదులిచ్చారు. పట్టణంలోని బమూల్ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ గతంలో తాను బమూల్ ఎన్నికల్లోనూ, కేఎంఎఫ్ డైరెక్టర్ స్థానానికి జడ్పీ ఎన్నికల్లోనూ పోటీ చేయడానికి తానువేసిన భిక్ష అన్న మాజీ ఎమ్మెల్యే మాటల్లో వాస్తవం లేదన్నారు. 2013లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నారని, అయితే తాను 1995 నుంచే కాంగ్రెస్‌లో కార్యకర్తగా ఉంటున్నా అన్నారు. మాజీ ఎమ్మెల్యే గంటిగానహళ్ళి కృష్ణప్ప తరఫున పనిచేశానని, 1997లో మజరా హొసహళ్ళి పంచాయతీ కాంగ్రెస్ కైవశం అయ్యేందుకు కృషి చేశానన్నారు. తనకు పార్టీ అవకాశం కల్పించినదానికంటే రెండురెట్లు పార్టీకోసం శ్రమించానన్నారు. మాజీ ఎమ్మెల్యేలు జే నరసింహస్వామి, ఆర్‌జీ వెంకటాచలయ్య గెలుపుకోసం తనవంతు కృషి చేశానన్నారు. అయితే ఎలాంటి ప్రలోభాలకు లోను కాలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు కూడా తాను మద్దతు ఇచ్చానని, ఉత్తమ వ్యక్తిత్వం కోసమే తాను సహకారం ఇస్తానన్నారు. అవినీతికి ఎవరు పాల్పడినా మద్దతు ఇచ్చేది లేదన్నారు. తాను కేపీసీసీ అధ్యక్షుడు డీకేశివకుమార్‌కు వీరాభిమాని అన్నారు. కేపీసీసీ అధికార ప్రతినిధి ఆరోపణల్లో వాస్తవం లేదని, రాత్రికి రాత్రి ఆయనను అభినందించడానికి వెళ్లలేదన్నారు. దొడ్డబళ్ళాపుర తాలూకాలో బమూల్ అభివృద్ధికి గతంలో భూమి మంజూరు చేశారని, మరింత ప్రగతికోసం ఆయనను మర్యాదపూర్వకంగా భేటీ అయ్యానన్నారు. మీడియా సమావేశంలో ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు రంగరాజు, నాగేశ్, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బమూల్ డైరెక్టర్ ఆనందకుమార్

పర్యావరణ పరిరక్షణపై మరింత జాగృతి



మొక్కలు నాటుతున్న అధికారులు

శిడ్లఘట్ట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై మరింత జాగృతి అవసరమని ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి ట్రస్టు నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. అటవీశాఖ సహకారంతో ద్యావప్పనగుడి ప్రభుత్వ హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. చింతామణి ఉప విభాగం అటవీశాఖ సహాయక అధికారి శంకరగౌడ మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాలలో సాధ్యమైన మేరకు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను విద్యార్థులు స్వీకరించి ఇతరులను ప్రోత్సహించాలన్నారు. తొలుత ప్రతి విద్యార్థి పాఠశాల ఆవరణలో ఒక్కో మొక్కను నాటాలన్నారు. తాలూకా యోజనాధికారి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి పథకంలో విద్యతోపాటు పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షులు నాగవేణి, ప్రాంతీయ అటవీశాఖ అధికారులు రాజేశ్ గోవల్, గ్రామ ప్రముఖులు బైరేగౌడ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి



కురుటుహళ్ళిలో శ్రవణ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి

చింతామణి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ టోర్నీలో ఆర్సీబీ జట్టు విజయం అనంతరం బెంగళూరులో నిర్వహించిన విజయోత్సవంలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 11మంది మృతి చెందారు. వీరిలో ఇద్దరు చిక్కబళ్ళాపుర జిల్లా వాసులు ఉన్నారు. వారి కుటుంబాలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ఆదివారం పరామర్శించారు. చింతామణి తాలూకా కురుటుహళ్ళికి చెందిన డెంటల్ రెండో సంవత్సరం చదువుతున్న కేటీ శ్రవణ్, తాలూకాలోని మురగమల్లా హోబళి గోపల్లికి చెందిన ఇంజనీరింగ్ పూర్తి చేసి బెంగళూరు టయోటా కిర్లోస్కర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ప్రజ్వల్ (22) మృతి చెందారు. ఆదివారం ఉదయం మంత్రి సుధాకర్ కురుటుహళ్ళికి చేరుకుని శ్రవణ్ కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామపెద్ద శ్రవణ్ తాత, తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు కృష్ణప్పను వారి పిల్లలకు ఓదార్పు పలికారు. అనంతరం ప్రజ్వల్ తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం మంత్రి సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ శ్రవణ్ కళాశాలకు సెలవులు కావడంతో పల్లెకు వచ్చి తోటపనిలో ఉండేవాడన్నారు. శ్రవణ్ ఎలాంటి క్రికెట్ అభిమాని కాదని, అయితే ఆర్సీబీ జట్టు గెలవడంతో విజయోత్సవాన్ని చూడాలనే ఉత్సాహంతో వచ్చి మృత్యువాత చెందాడని విచారం వ్యక్తం చేశారు. ప్రజ్వల్ కుటుంబానికి చెందిన బాలికల విద్యకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కాగా పరిహారం గురించి అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా అందేలా చూస్తానన్నారు.



గోపల్లిలో ప్రజ్వల్ తల్లిదండ్రుల పరామర్శ

సత్యసాయి ప్రేమతత్వం.. శాంతిధామం..

● శ్రీసత్యసాయి సేవాసంస్థల కోఆర్డినేటర్ శశిబాల ● ముగిసిన మహిళా సదస్సు

పుట్టపర్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమ తత్వం.. శాంతిధామమని శ్రీసత్యసాయి సేవాసంస్థల కోఆర్డినేటర్ శశిబాల పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి గ్లోబల్ మహిళా సదస్సు చివరిరోజు ఆదివాం ఘనంగా సాగింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో విద్యార్థుల వేదపఠనంతో సదస్సు ప్రారంభమైంది. శ్రీసత్యసాయి సేవాసంస్థల కోఆర్డినేటర్ శశిబాల మాట్లాడుతూ.. సత్యసాయి సేవ, ఆధ్యాత్మిక బోధనల స్ఫూర్తితో సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా సత్యసాయి సేవాసంస్థలు సామాజిక సేవ చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం బావికాస్ విద్యార్థినులు బ్యాండ్, భక్తి గీతాల ఆలాపనతో అలరించారు. చివరిరోజు సదస్సులో మూడువేల మంది మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థినులు

కళలను ప్రోత్సహించడం అభినందనీయం



అన్వయ ప్రారంభోత్సవంలో అశ్విని పునీత్‌రాజ్‌కుమార్ తదితరులు

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ నృత్య, సంగీత, వాద్య కళల పరంపరను కొనసాగించేలా పలు సంస్థలు చేపడుతుండం అభినందనీయమని అశ్విని పునీత్‌రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. నాగరభావి రెండో స్టేజ్ పాపరెడ్డి పాళ్యలో అన్వయ కళాలయ సంస్థను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అశ్విని పునీత్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ రంజితా విజయకుమార్ వృత్తిరీత్యా సివిల్ ఇంజనీర్ అయినా బాల్యంనుంచి నృత్యంపై ఆసక్తితో రాణించారన్నారు. ఆరేడేళ్లకే భరతనాట్యం నేర్చుకున్నారన్నారు. 11 ఏళ్లుగా కథక్ నేర్చుకుంటున్నారన్నారు. 2022లో కథక్ రంగప్రవేశం విజయవంతం చేశారని అనేక ప్రముఖ వేదికలు, ఆలయాలలో భక్తిపూర్వక కార్యక్రమాలలో పాల్గొన్నారన్నారు. ఆమె సోదరి కానినికా కూడా కథక్‌లో నిపుణులన్నారు. 2023లో రంజితా గాయకులైన నిశాంత్‌లో వివాహం జరిగిందన్నారు. అయినా నృత్య కళలను ప్రోత్సహించేలా అన్వయను ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ నృత్యం, సంగీతం, తబలా, గిటార్ యోగా తరగతులు నిర్వహించనున్నారని పిల్లలకు మన సంస్కృతి సంప్రదాయాలు నేర్పించాలన్నారు.

యడియూరప్ప మనవడి పెళ్లికి బీజేపీ అగ్రనేతలు



వివాహ రిసెప్షన్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ తదితరులు

బెంగళూరు, జూన్8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప కుమారుడు, ఎంపీ బీవై రాఘవేంద్ర తనయుడు సుభాష్, శ్రావణల పెళ్లి వేడుకలకు బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. శనివారం రాత్రి జరిగిన రిసెప్షన్ వేడుకలకు సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు జమీర్ అహ్మద్, బైరతి సురేశ్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్‌లు వధూవరులను ఆశీర్వదించారు. రాకింగ్‌స్టార్ యశ్ నవవధూవరులను ఆశీర్వదించారు. ఆదివారం జరిగిన ముహూర్తపు వేడుకలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్ పలువురు అగ్రనేతలు పాల్గొన్నారు.

చిలకలనేర్పులో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో ప్రముఖులు

చేళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చిలకలనేర్పు గ్రామంలోని అక్షర పాఠశాలలో బెంగళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య వైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బెంగళూరుకు చెందిన ఎంఎస్ రామయ్యగౌడ, సురేశ్ చౌడరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. రామయ్యగౌడ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మాకు ఎన్నో ఏళ్లుగా పరిచయాలు ఉన్నాయని, గతంలో ఇక్కడ సరైన ఆసుపత్రి సదుపాయంగానీ, పాఠశాల సౌకర్యంగా లేవన్నారు. ఇప్పుడిప్పుడే పురోగతి చెందుతున్నాయన్నారు. గ్రామస్థులకోసం వైద్య సదుపాయాలను శిబిరాలు చేస్తున్నామన్నారు. శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే బెంగళూరు ఎంఎస్ రామయ్య ఆసుపత్రిలో బీపీఎల్ కార్డుదారులకు ఉచిత చికిత్సలు ఉంటాయన్నారు.

రేపు పుట్టపర్తికి వైఎస్ షర్మిల రాక

పుట్టపర్తి టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 10న పుట్టపర్తి రానున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా సత్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయిఆరామంలో జరిగే జిల్లా స్థాయి కాంగ్రెస్ సమీక్షా సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు వివరించారు.

11న అనంతకు..

● అనంతపురం న్యూటౌన్ : రాష్ట్ర పర్యటనలో భాగంగా 11న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 10 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని విభాగాల నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.